క్లుప్తంగా

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, ఇతరులు

టేకులపల్లి: మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను బుధవారం ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాణోతు హరిసింగ్‌నాయక్, సర్పంచ్ బోడ సరిత, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్, చిట్టెమ్మ, నామా నాయక్, సురేందర్, నరేష్, భాను, కందస్వామి, మోహన్‌రావు, రామ, శ్రీనివాస్‌రాజు, ప్రసాద్, శివ, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

సుజాతనగర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మీ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో యువతకు పీఎస్‌ఆర్ ట్రస్ట్ సహకారంతో వాలీబాల్ కిట్లను సర్పంచ్ కల్తి పద్మ బుధవారం పంపిణీ చేశారు. రావుల అయిలయ్య, కాయం శ్రీకాంత్, చీమల సందీప్ పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌తో రైతులకు ఇబ్బందులు

పాల్వంచ: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రైతులకు గుదిబండగా మారిందని యువతరం పార్టీ జిల్లా అధ్యక్షులు బుడగం నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతుబంధు సకాలంలో అందక రైతులు పెట్టుబడులకు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. దళితబంధు ఎమ్మెల్యే అనుచరులకే పరిమితం అయిందన్నారు. మండల అధ్యక్షులు శివరామకృష్ణ, కె.సత్యనారాయణ, పవన్, గణేష్, చిట్టిబాబు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ఇల్లెందురూరల్: మండలంలోని బోయితండా పంచాయతీ పరిధిలో రహదారి పనులను సర్పంచ్ బానోత్ సంతు బుధవారం ప్రారంభించారు. భారీ వర్షాలతో అధ్వానంగా మారిన ప్రధాన రహదారిపై పంచాయతీ నిధులతో మొరం పోయించి చదును చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

సుజాతనగర్: నట్టల నివారణ మందులను పశు యజమానులు వినియోగించుకోవాలని పశు వైద్యాధికారి జి.నాగులు అన్నారు. నట్టల నివారణ మందుల పంపిణీలో భాగంగా వేపలగడ్డ, గొల్లగూడెం, సుజాతనగర్, మంగపేట గ్రామాల్లో గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నట్టల నివారణ మందుల ద్వారా మూగజీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, మండల వ్యాప్తంగా ఈ నెల 28 వరకు మందులు పంపిణీ చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రుక్సాన, రవి, నరసింహా, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ

సుజాతనగర్: జీపీడీపీలో భాగంగా సుజాతనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సీకా కృష్ణవేణి అధ్యక్షతన బుధవారం జరిగిన గ్రామసభకు ప్రజల నుంచి స్పందన కరువైంది. గ్రామసభకు గ్రామస్థాయిలో అన్ని శాఖల అధికారులు, వార్డు మెంబర్లు హాజరు కావాల్సి ఉన్నా ఏదో మొక్కుబడిగా మూడు నాలుగు శాఖలకు సంబంధించిన వారు మాత్రమే హాజరయ్యారు.

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ గ్రామసభ బుధవారం నిర్వహించారు. సర్పంచ్ వల్లాల మంగమ్మ, ఉపసర్పంచ్ నాలవెల్లి నర్సింహారావు, వార్డు సభ్యులు, కార్యదర్శి రజినీకాంత్ పాల్గొన్నారు.

ఎఫ్‌డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన

ఇల్లెందు: సీఎస్‌పీ బస్తీ పంచాయతీ రాజీవ్ నగర్ శివారులో ఏర్పాటు చేసుకున్న గుడిసెలను ఫారెస్టు శాఖ తొలగించాలని సర్వే చేస్తోందని, పేదలపై ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని తక్షణం సర్వే నిలిపి వేసి అందరికీ పట్టాలు అందజేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌ఏ నబీ డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందు ఎఫ్‌డీఓ కార్యాలయం ఎదుట గుడిసె వాసులు ఆందోళన నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ స్వామికి వినతిపత్రం అందజేశారు. తాళ్లూరి కృష్ణ, మోహన్ రావు, డి.రాందాస్, వైకుంఠం, వెంకన్న, సుధాకర్, పాషా, వీరన్న, వీరస్వామీ, శంకర్, విజయ, పద్మ, సరిత, లక్ష్మీ, రజియా, ఖైరూన్, కౌసల్య, అమ్మి, గోబ్రియ, పాల్గొన్నారు.

పెరిగిన యాసంగి..!

గతేడాది కంటే నాలుగురెట్లు
- సుమారు 900 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు
- కొత్త పద్ధతులపై రైతుల ఆసక్తి



బోర్ నీటిని మడులకు పెడుతున్న దృశ్యం



మడుల్లో విత్తనాలు చల్లడంతో పెరిగిన వరి

జూలూరుపాడు: ఈ యాసంగిలో వరి పంట సాగు గతేడాది కంటే నాలుగు రెట్లు పెరిగింది. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని విస్తృతంగా ప్రచారం చేయడంతో సుమారు 200 ఎకరాల్లోనే సాగయ్యింది. ఈ ఏడాది ప్రభుత్వం ఎలాంటి షరతులు పెట్టకపోవడంతో జూలూరుపాడు మండల వ్యాప్తంగా సుమారు 900 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేశారు. మూడేళ్ల క్రితం యాసంగి సాగు 1,111 ఎకరాల్లో వేశారు. వరిసాగు విస్తీర్ణం తగ్గడానికి ఈ ఏడాది యాసంగిలో మొక్కజొన్న సాగుపై రైతులు మొగ్గు చూపడమే కారణం. ఖరీఫ్ సీజనల్‌లో వరి పంట దిగుబడి గణనీయంగా పెరిగింది. ఎకరానికి 35–40 బస్తాల వరి ధాన్యం దిగుబడి వచ్చింది. యాసంగిలో అత్యధిక విస్తీర్ణంలో దుడ్డు(మొద్దులు) వరి విత్తనాలను దమ్ము చేసిన పొలాల్లో చల్లారు. దిగుబడి 30–35 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉండటంతో మొద్దు వరి విత్తనాలు సాగు చేయగా, అక్కడక్కడ అతి తక్కువ విస్తీర్ణంలో సన్నాలు సాగు చేశారు. నీటి వసతి ఉన్న చెరువుల ఆయకట్టు, చెక్‌డ్యామ్‌లు, వాగులు, వ్యవసాయ బోర్ల కింద ఉన్న భూముల్లో వరి పంట సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. ఈసారి వరి విత్తనాలను నేరుగా పొలంలో చల్లారు. కూలీల కొరత అధిగమించడం, పెట్టుబడి తగ్గడం, తక్కువ కాల వ్యవధిలో పంట చేతికి వస్తుందని రైతులు నేరుగా వరి విత్తనాలను చల్లే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దీంతో ఎకరానికి పెట్టుబడి రూ 10 వేలు అవుతుందని రైతులు చెబుతున్నారు. మరికొంత మంది రైతులు మాత్రం నారు పోసి పెరిగిన తరువాత వరి నాట్లు వేయించారు. ఖరీఫ్‌లో పంట దిగుబడి వచ్చినట్లే యాసంగిలో కలిసి రాకపోతుందా అనే ఆశతో రైతులు సాగు చేస్తున్నారు.

ఎనిమిదెకరాల్లో సాగు చేస్తున్నా..



యాసంగిలో ఎనిమిదెకరాల్లో వరి సాగు చేస్తున్నా. గతేడాది ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం చెప్పడంతో వరి పంట సాగు చేయలేదు. ఐదెకరాలు రూ.40 వేలు తీసుకోక పోగా, మరో మూడు ఎకరాలు సొంత పొలం వరి పంట సాగు చేశాను. ఇప్పటి వరకు వరి సాగుకు పెట్టుబడి రూ 80 వేలు, కౌలు రూ.40 వేలు కాగా మొత్తం రూ 1.20 లక్షలయ్యింది.

– నున్నా విజయకుమార్, రైతు, కొత్తూరు

దిగుబడి బాగానే వస్తుంది..



యాసంగిలో వరి పంట దిగుబడి బాగానే వస్తుందని సాగు చేస్తున్నా. మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాను. ఎకరానికి రూ 15 వేలు చొప్పున రూ 45 వేలు పెట్టుబడి అయింది. ఖరీఫ్‌లో వరి సాగు చేస్తే ఎకరానికి 35–40 బస్తాలు వరి ధాన్యం దిగుబడి వచ్చింది. రబీలో కూడా 30–35 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

– కిలారి నాగరాజు, రైతు, జడలచింత

సాగు పెరిగింది..



గతేడాది యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించడంతో సుమారు 200 ఎకరాల్లో మాత్రమే వరి సాగు కాగా ఈ యాసంగిలో సుమారు 900 ఎకరాల్లో సాగు పెరిగింది . యాసంగిలో మినుము, పెసర, సజ్జ, జొన్న, ప్రొద్దుతిరుగుడు, వేరుశనగ, కూరగాయలు లాభదాయకంగా ఉంటుంది.

– ఎస్ రఘుదీపిక, ఏఓ, జూలూరుపాడు

చేకూరి కాశయ్య ఆదర్శప్రాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

చుంచుపల్లి: ప్రజాక్షేత్రంలో అందరివాడిలా నిలిచిపోయిన మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్ చేకూరి కాశయ్య అందరికీ ఆదర్శప్రాయుడని కొత్తగూడెం శాసన సభ్యులు వనమా వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో చేకూరి కాశయ్య విగ్రహ ఏర్పాటుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వనమా మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాలో రాజకీయాలకు అతీతంగా పనిచేసిన వ్యక్తి కాశయ్య అన్నారు. విలువలు కలిగిన నేతగా అందరిచేత మన్ననలు పొందారన్నారు. కాశయ్య పేదల అభ్యున్నతి పాటుపడ్డారని, ఎందరికో రాజకీయ పాఠాలు నేర్పిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, బిక్కసాని నాగేశ్వర రావు,రజాక్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కాంగ్రెస్‌తోనే ప్రయోజనం



పాదయాత్రలో భాగంగా ఇంటింటికీ ప్రచారంలో ఎడవల్లి కృష్ణ, నాయకులు

చుంచుపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు ప్రయోజనం చేకూరుతుందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. మండలంలోని చుంచుపల్లి తండా, హౌసింగ్ బోర్డు కాలనీల్లో బుధవారం ఆయన హాథ్ సే హాథ్ అభియాన్ జోడో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర లేక, రుణ మాఫీ జరగక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

చింతల చెరువు ఆక్రమణపై చర్య తీసుకోవాలి

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని చింతల చెరువు ఆక్రమణపై సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. చెరువు కట్టపై 50 అడుగుల రోడ్డు నిర్మాణం రియల్టర్లకు అనుకూలంగా ప్రతిపాదిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు రాయల శాంతయ్య, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల అధ్యక్షులు బొమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, కొత్తగూడెం మండల అధ్యక్షుడు అంతోటి పాల్‌తో పాటు నాయకులు సకినాల వెంకటేశ్వరావు, గిన్నారపు నాగేందర్, కోటేష్ నాయక్, రఘునాథ్, అంతోటి రాజు, శనగ లక్ష్మణ్, ఫైజుద్దీన్, శ్రీనివాస్, పవన్, చారి, పైడిపల్లి మనోహర్‌రావు, కొండం వెంకన్న, బత్తుల వెంకటేశ్వరరావు, రామ, చంద్రగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా దమ్మపేట జంక్షన్

పాల్వంచ: పట్టణంలోని దమ్మపేట సెంటర్ జంక్షన్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అన్నారు. బుధవారం దమ్మపేట కూడలిలో అభివృద్ధి పనులకు సంబంధించి మార్కింగ్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దమ్మపేట సెంటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో విస్తరణ చేయడం జరుగుతుందని, అందులో భాగంగా జంక్షన్‌ను అంబేడ్కర్ సెంటర్ మాదిరిగా తీర్చిద్దేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. డీఈ మురళీ, ఎఈ రాజేశ్, ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీర్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కొత్తగూడెంటౌన్: రంగారెడ్డి జిల్లాకు చెందిన న్యాయవాది నారపాక సురేందర్‌పై జరిగిన హత్యాయత్నానికి నిరసనగా బుధవారం కొత్తగూడెంబార్ అసోసియోషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాదరావు, రమేష్‌కుమార్ మక్కడ్, లక్కినేని సత్యనారాయణ, చల్లా శ్రీనివాస్, తోట మల్లేశ్వరావు, కటికం పుల్లయ్య, రమేష్, పాతూరి విఠల్, షామీర్ శరత్, కన్నెగంటి శ్రీదర్, గాదె సునంద, న్యాయవాదులు పాల్గొన్నారు..

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాల్వంచ: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ ఎస్సై కె.నరేష్ అన్నారు. బుధవారం స్థానిక నటరాజ్ సెంటర్ నందు ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రధాన సెంటర్లలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, పాదాచారాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆటో వాహనాలను నడపాలన్నారు. ప్రతీ ఒక్కరు అన్ని రకాల అనుమతులు ఉండాలన్నారు.

సామూహిక సీమంతాలు

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధిలోని 30 వార్డు మధురబస్తీ అంగన్‌వాడీ సెంటర్ 5లో బుధవారం ఘనంగా సీమంతం, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ చంద్రకళ, వార్డు కౌన్సిలర్ ఎస్. సమైఖ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, చిన్నారులు, చిన్నారుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

ఏజెన్సీ చట్టాలు తుంగలోకి..

జూలూరుపాడు: రాజకీయ నాయకులకు అధికారులు కొమ్ముకాస్తూ ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తెల్లం నరసింహారావు ఆరోపించారు. బుధవారం జూలూరుపాడులో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కన్వీనర్ బచ్చల లక్ష్మయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ నాయకులు సహజ సంపదను దోచుకుంటూ లక్షల కోట్లు దండుకుంటున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు పూనెం సూరయ్య, పద్దం చంద్రయ్య, వర్సా రామకృష్ణ, బత్తుల పుల్లయ్య, మహేష్, సూరిబాబు, నరేష్, వెలగల నవీన్, జగన్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించాలి

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించాలని సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు జక్కం వాణి అన్నారు. సింగరేణి సేవా సమితి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో బుధవారం జిల్లా యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలను జెండా ఊపి ఆమె ప్రారంభించారు. పోటీలకు వంద మంది అథ్లెటిక్స్ పాల్గొనగా, 20 మందిని ఎంపిక చేశారు. ఈనెల 25, 26 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌నకు వీరిని పంపించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహిధర్ తెలిపారు. ఏరియా ఉపాధ్యక్షుడు ఎండి.రజాక్, రజాక్ పాతిమా, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సుధాకర్ రావు, సెక్యూరిటీ ఆఫీసర్ రమణరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణ, సేవా సమితి వైస్ ప్రెసిడెంట్ పాతిమా రజాక్, సెక్రటరీ భూలక్ష్మీ, కోచ్ నాగేందర్, జన్ను ప్రసాద్, కృష్ణ, నాగరాజు, రియాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

టేకులపల్లి: అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్లు, ఆయాల సమస్యల పరిష్కారంకోసం వచ్చే వచ్చే నెల 1నుంచి 3వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకర పద్మ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో బుధవారం ఏర్పాటుచేసిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు అబ్దుల్ నబీ, కొండపల్లి శకుంతల, సారమ్మ, జయశ్రీ, పద్మ, రాజేశ్వరి, కౌసల్య, సుశీల, జయసుధ, అనసూర్య, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సేవా సెక్రటరీలకు, సేవా సభ్యులకు జీఎం పర్సనల్ కట్టా బసవయ్య సూచించారు. బుధవారం కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో ఆయన చాంబర్‌లో సేవా సెక్రటరీ, సేవా సమితి సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి7న సీఈఆర్ క్లబ్‌లో సేవా సభ్యులకు ఆటల పోటీలు నిర్వహించి 9న బహుమతులు అందజేస్తామన్నారు. డీజీఎం పర్సనల్ శ్రీనివాసరావు, పీవోలు గట్టు స్వామి, బేతిరాజు, సుశీల్ కుమార్, సేవా సెక్రటరీ మునీలా, షరీప్, వహిదా, సుజాత, తదితరులు ఉన్నారు.

బాల్యం నుండే క్రమశిక్షణ అలవర్చుకోవాలి



సింగరేణి(కొత్తగూడెం): పావెల్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జీఎం



ఇల్లెందు: మంచె నిర్మాణం చేస్తున్న విద్యార్థులు

ఇల్లెందు: ఏ రంగంలో పనిచేసినా మానవాళికి ఉపయోగపడే కొత్తదనం ఉట్టిపడే ఆలోచనలు చేయాలని ఇన్‌చార్జ్ జీఎం పంజాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఇల్లెందు సింగరేణి స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కౌట్స్ ఉద్యమ నిర్మాత బేడేన్ పావెల్ జన్మదిన వేడుకలు, ప్రపంచ ఆలోచన దినోత్సవం సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రీహరి, సాయి స్వరూప్, హెచ్‌ఎంలు టి.వెంకటేశ్వర్లు, సుధాకర్, మేరీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): బాల్యం నుండే క్రమశిక్షణ అలవర్చుకోవాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య అన్నారు. వరల్డ్ థింకింగ్ డే సందర్భంగా సింగరేణి డిస్ట్రిక్ట్ సెక్రటరీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ మూమెంట్ వ్యవస్థాపకులు బాడెన్ పావెల్ జయంతిని కొత్తగూడెంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ పతాకావిష్కరణ చేసి, కేక్ కట్ చేసి ర్యాలీ నిర్వహించారు. సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రావు, గైడ్ కమిషనర్ సిహెచ్.శారద, సుశీల్ కుమార్, ఏఎస్‌ఓసీ సాయినిరంజన్, డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్ వి.వెంకటస్వామి, కొమరయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యాక్టివా హెచ్-స్మార్ట్ విడుదల



యాక్టివాను ప్రారంభిస్తున్న డీటీఓ వేణు

కొత్తగూడెంరూరల్: హోండా మోటార్‌సైకిల్ మార్కెట్లోకి మరో స్కూటర్ యాక్టివా హెచ్-స్మార్ట్ పేరుతో మార్కెట్‌లోకి బుధవారం విడుదల చేసింది. హోండా యాక్టివా 6జీ ని అప్డేట్ మోడల్‌తో వినియోగదారులకు ఈ స్కూటీని అందిస్తుంది. కొత్తగూడెంలో కటకం హోండాలో డీటీఓ వేణు చేతుల మీదుగా ప్రారంభించారు.

ఉపవాస దీక్ష ప్రారంభం



ప్రార్థన చేయిస్తున్న పాస్టర్

ఇల్లెందురూరల్: ఏసు సిలువ మరణాన్ని గుర్తు చేసుకుంటూ మండలంలోని క్రైస్తవులు బుధవారం నుంచి భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు ప్రారంభించారు. పలు గ్రామాలలో క్రైస్తవులు ఉదయం నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి చర్చి పాస్టర్లు బోధించారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త..

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల వినియోగం పెరగడంతో పాటు సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతోందని టూ టౌన్ పోలీసు స్టేషన్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. బుధవారం సైబర్ నేరాల జాగృతిలో భాగంగా సుభాష్ చంద్రబోస్ నగర్, రామవరంలోని మోడ్రన్ ఇఖ్రా స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. సమాజంలో పూర్వం జరిగే దోపిడీ, దొంగతనాలు తగ్గి సైబర్ నేరాల సంఖ్య రోజు రోజుకు పెరిగి పోతున్నాయని, ఇందులో ఎక్కువగా మోసపోతున్న వారు బాగా చదువుకున్న వారే ఉన్నారన్నారు. చదువుకున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులను జాగృతి పరచాలన్నారు. తెలియని వారి ఫోన్లకు సమాధానం ఇవ్వొద్దని, ఓటీపీ ఎవరితో పంచుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రామకృష్ణ, కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్, అబ్దుల్ జబ్బార్, ఖాజా, బ్లూ కోట్‌బృందం బుచ్చి రాములు, శ్రీనివాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

26న ఇఫ్టూ మహాసభ

ఇల్లెందు: కార్మిక హక్కులను పోరాటాలతో సాధించుకున్న ఇఫ్టూ ఈ నెల 26న ఇల్లెందులో జిల్లా మహాసభ నిర్వహించబోతుందని తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రాంసింగ్ కోరారు. ఇఫ్టూ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఉషా టైల్స్ ఫ్యాక్టరీలో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో రాంసింగ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, రాధమ్మ, శివ, భద్రయ్య, బజారు, రవి, రమేష్ పాల్గొన్నారు.

జీపీ కార్యాలయం ప్రారంభం

చుంచుపల్లి: ఇప్పటివరకు సింగరేణి క్వార్టర్స్‌లో కొనసాగుతున్న బాబూక్యాంపు పంచాయతీకి జిల్లా కలెక్టర్ చొరవతో పాత డీఈఓ ఆఫీస్‌ను కేటాయించారు. బుధవారం చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి పంచాయతీ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సర్పంచ్ గుగులోత్ బాబూరావు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్నిస్ కోర్టుకు స్థలం కేటాయించాలి

పాల్వంచ: టెన్నిస్ క్రీడాకారుల కోసం ఆట స్థలాన్ని కేటాయించాలని జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో టెన్నిస్ క్రీడాకారులు అనేక మంది ఉన్నారని, వారిని ప్రొత్సహించేందుకు అసోసియేషన్ ఎంతగానో కృషి చేస్తుందని వివరించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి, సెక్రటరీ జకరియా, వై.వెంకటేశ్వర్లు, వాసు, అన్నం వెంకటేశ్వర్లు, వైటీఎంకె రాజు, ఎండి.ఆరిఫ్, గట్టయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధికి సహకరించాలి

సింగరేణి(కొత్తగూడెం): సంస్థ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధికారుల ఆదేశాల మేరకు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్ ఆకాంక్షించారు. బుధవారం ఏరియాలో కార్మికుల పిల్లలకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్, ఎస్ఓటూ జీఎం శ్రీ రమేష్, సీనియర్ పీఓలు మజ్జి మురళి, జి.సుధాకర్, ఆఫీస్ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ ఎస్.అనూష, సాగర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో 'హలో బ్రదర్స్'



కవలలతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

పాల్వంచ: ఒక చోట ఇద్దరు కవల పిల్లలు ఉంటేనే ఎవరు ఎవరో కూడా అర్థం కాక తికమక పడుతుంటాం. అలాంటిది ఒకే పాఠశాలలో 18 మంది కవలల పిల్లలు విద్యనభ్యసిస్తే... పాల్వంచలోని కేటీపీఎస్ డీఏవీ పాఠశాలలో బుధవారం ఘనంగా కవలల దినోత్సవాన్ని నిర్వహించారు. 18 జంట కవలలు ఒకే రంగు దుస్తులతో హాజరై నృత్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ ఎ.రామారావు, సీసీఏ కో ఆర్డినేటర్‌లు రాజశేఖర్, సుష్మ, శ్యామలాదేవి, అనూష తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం, జగన్నాథపురం గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రంలో బుధవారం అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కనకదుర్గ గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మడివి సరస్వతి, సర్పంచ్ బాదావత్ శాంతి, ఉపసర్పంచ్ మడకం శ్రీను, వార్డు సభ్యులు బాలకృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనసూయ, ఐసీపీఎస్ కౌన్సిలర్ కళ్యాణి, శ్రీను పాల్గొన్నారు.

ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవం

సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు జెండా ఎగురవేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామని నాయకులు అన్నారు. –సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: మాట్లాడుతున్న ప్రజాపంథా రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ



పాల్వంచరూరల్: నినాదాలు చేస్తున్న నాయకులు